మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం వంతడపలలో పంచాయతీ కార్యదర్శిని నిలబీస్తున్న గ్రామస్తులు

దరఖాస్తులు 300.. అర్హులు 40 మందే!

- తప్పుల తడకగా రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితా
- కార్యదర్శిని నిలదీసిన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

నర్సింహులపేట, జనవరి 19 : కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన రేషన్‌కార్డుల జాబితా ప్రజలను గందరగోళంలో పడేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికం చేయడంతో కులగణనలో ప్రతిఒక్కరూ కొత్త రేషన్ కార్డు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు కోసం పేర్లను నమోదు చేయించుకున్నారు. సర్వేలో రాయించుకున్న వారి పేర్లు జాబితాలో రాకపోగా, అనర్హులకు పేర్లు ఉండడంతో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం వంతడపల గ్రామంలో ఆదివారం గ్రామ కార్యదర్శి రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాలో వచ్చిన పేర్లను చదివి వినిపించారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉండడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కులగణన సమయంలో హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వాళ్లు కూడా గ్రామానికి వచ్చి తమకు రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు కావాలని సర్వేలో నమోదు చేయించుకున్నారు. గ్రామం నుంచి 300 నుంచి 400 మంది రేషన్ కార్డుల కోసం సర్వేలో నమోదు చేసుకోగా, కేవలం 40 మంది పేర్లు మాత్రమే రావడమేంటని కార్యదర్శిని ప్రశ్నించారు. జాబితాలో అర్హుల పేర్లు లేకుండా, తాత్కాలికంగా నివాసముంటున్న వివిధ రాష్ట్రాలకు చెందిన వారి పేర్లు, అనర్హుల పేర్లు రావడంతో గొడవలు మొదలయ్యాయి. లిస్టులో పేర్లు లేని వారంతా గ్రామపంచాయతీ వద్దకు వెళ్లి తమ పేర్లు ఎలా తొలగించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ పేర్లు అర్హుల జాబితాలో చేర్చకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందంటూ హెచ్చరిస్తున్నారు.

లిస్టులో నా పేరు లేదు

కులగణన సమయంలో అధికారులు మా ఇంటికి వచ్చారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న. మా ఇంటికి రెండు ప్రజాపాలన స్టిక్కర్లు పెట్టారు. తీరా ఇప్పుడు చూస్తే నాపేరు లిస్టులో లేదు. అధికారుల తప్పిదం వల్ల నాకు రేషన్ కార్డు లేకుండాపోయింది. మరోసారి రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోమంటున్నారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి. తప్పులు చేసిన అధికారులపై చర్య తీసుకోవాలి.

- కమటం వెంకన్న, వంతడపల, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు

ఉద్యోగస్థుల పేర్లున్నాయి

మా గ్రామంలో రేషన్‌కార్డు కోసం 300 మంది అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో మాత్రం 40 పేర్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో కార్డు ఉన్నవారు, ఉద్యోగం ఉన్నవారి పేర్లు ఉన్నాయి. వ్యవసాయం ఉన్న వారి పేర్లు ఆత్మీయ భరోసాలో చేర్చారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా అందించే విధంగా చూడాలి.

- వెలిశాల యాకయ్య, వంతడపల

'స్థానిక' ఎన్నికలపై గందరగోళం

- బీసీల రిజర్వేషన్లపై సందిగ్ధం
- ఇప్పటికీ కొలిక్కిరాని కులగణన
- అందని డెడికేటేడ్ కమిషన్ నివేదిక
- 50 శాతం కోటా దాటాలంటే పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిందే
- అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని నిర్ణయించిన రాష్ట్ర సర్కారు
- వెరసి ఎన్నికలు మరికొంత కాలం ఆలస్యమయ్యే అవకాశం

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై గందరగోళం నెలకొన్నది. జనవరి చివరి వారంలో నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరి 15లోగా సర్పంచ్ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అడుగు ముందుకుపడటం లేదు. జనవరి నెల మూడో వారం పూర్తికావస్తున్నా దానిపై స్పష్టత రావడం లేదు. రాష్ట్రంలో వివిధ కులాల జనాభా, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు తెలుసుకునేందుకు చేపట్టిన కులగణన సర్వేకు మంత్రివర్గ ఆమోదం లభించలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు లక్ష్యంగా నియమించిన డెడికేటేడ్ కమిషన్ నివేదిక అందలేదు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే పరిస్థితులు కనిపించడం లేదు.

ఏడాదైనా సందిగ్ధమే..

సర్పంచుల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది కావస్తున్నది. అయినప్పటికీ ఎన్నికల నిర్వహణపై ఏర్పడిన సందిగ్ధం తొలగడం లేదు. క్షేత్రస్థాయి నాయకత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్నా ప్రభుత్వం మాత్రం ఈ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు త్వరలోనే ఎన్నికలంటూ తరచూ ఊదరగొడుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. 42 శాతం బీసీ కోటా కేటాయింపు, కులగణన సర్వేకు చట్టబద్ధతపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరోవైపు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నదని అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తగలడం ఖాయమని లోలోన దిగులు పడుతున్నారు. దీంతో ఈ నెల 26 నుంచి రైతుభరోసా, రైతు కూలీలకు నగదు చెల్లింపు, ఇందిరమ్మ ఇండ్ల పథకం, రేషన్‌కార్డుల పంపిణీని పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే క్యాడర్ నీరుగారిపోకుండా ఉండేందుకే త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ఊదరగొడుతున్నట్టు తెలుస్తున్నది.

చట్టపరమైన చిక్కుముడులెన్నో..

రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నా ఎన్నికలకు చట్టపరమైన చిక్కుముడులు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కేంద్రం అనుమతి లేకుండానే చేపట్టిన కులగణన నివేదికను బహిర్గతం చేయడం ద్వారా న్యాయపరమైన సమస్యలు ఎదురుకానున్నాయి. గతంలో బీహార్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో చేపట్టిన కులగణన కోర్టుల్లో నిలబడలేదు. ఈ పరిస్థితుల్లో మన రాష్ట్రంలో చేపట్టిన కులగణన నివేదికను బహిర్గతం చేస్తే దానిపై ఎవరైనా కోర్టుకు వెళ్తే సర్కారుకు చుక్కెదురయ్యే అవకాశాలు ఉంటాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. గతంలో వివిధ రాష్ట్రాల్లో ఎదురైన పరిస్థితులు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను వారు ఉదహరిస్తున్నారు.

42 శాతం కోటా తేల్చడం కష్టమే..

బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఇందుకోసం బీసీ కమిషన్ ఏర్పాటుతో పాటు కులగణన చేపడుతున్నామని చెప్పింది. అయితే బీసీ కమిషన్‌కు రిజర్వేషన్లు ప్రతిపాదించే అధికారం లేదని బీసీ సంఘాలు, న్యాయకోవిదుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం నవంబర్ 4న డెడికేటేడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి వివరాలు సేకరించింది. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వానికి నివేదిక అందించలేదు. అయితే ఈ కమిషన్ 42 శాతం ఇవ్వాలని ప్రతిపాదించినా ఆచరణ సాధ్యంకాదని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే స్థానిక ఎన్నికల్లో 50 శాతం కోటా దాటితే కోర్టుల్లో చెల్లుబాటు కాదని పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ట్రిపుల్ టెస్ట్ పాసయ్యే అవకాశం ఎంత మాత్రం లేదంటున్నారు.

ఆలస్యం అనివార్యం..

ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొనడం, మరోవైపు చట్టపరమైన చిక్కులు కొలిక్కివచ్చే అవకాశాలు లేకపోడంతో ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రెండు వారాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేస్తామని ఎలక్షన్ కమిషన్ అధికారులు చెబుతున్నా ప్రభుత్వం మాత్రం ఇందుకు సంసిద్ధత తెలపడం లేదు. ఎందుకంటే పథకాల ఫలాలు అందకపోవడం, చట్టపరమైన ఇబ్బందుల నేపథ్యంలో కక్కలేని, మింగలేని పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. ఈ వ్యవహారాలన్నీ కొలిక్కి వచ్చిన మీదటే స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సుమారు మూడు, నాలుగు నెలలు పట్టే అవకాశం లేకపోలేదు.

రాజ్యాంగ సవరణ తప్పనిసరి..

ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం కోటాకు మించి రిజర్వేషన్లు ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరని న్యాయకోవిదులు చెబుతున్నారు. మరి కేంద్రం అందుకు అనుమతిస్తుందా? అనే విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఒక రాష్ట్రానికి అనుమతి ఇస్తే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఇదే డిమాండ్ వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో చట్ట సవరణకు అంగీకరించే పరిస్థితులు ఎంత మాత్రం కనిపించడం లేదు. ఒకవేళ బీసీ రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలకు వెళ్తే ఆయా వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు బీసీ వర్గానికి చెందిన మంత్రులు సైతం ఇందుకు ఒప్పుకొనే అవకాశాలు కపిపించడం లేదు.

దైవ దర్శనానికి వెళ్తున్న వాహనం బోల్తా

- డీసీఎంలో 80 మంది ప్రయాణం ఒకరి మృతి.. 40 మందికిగాయాలు
- రిమ్స్, ఉట్నూర్ దవాఖానల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మాల్కుగూడ మూలమలుపు వద్ద బోల్తాపడ్డ డీసీఎం వాహనం

నార్నూర్/ఇంద్రవెల్లి/ఎదులాపురం, జనవరి 19 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సూర్యగూడకు చెందిన ఆదివాసులు 80 మంది వరకు మహారాష్ట్రలోని జంగుబాయి దర్శనానికి ఆదివారం డీసీఎం వాహనంలో బయలుదేరారు. నార్నూర్ మండలంలోని మాల్కుగూడ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొమ్మిది అంబులెన్స్‌లు, ప్రైవేటు వాహనాల్లో నార్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. 15 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అందులోనుంచి కొందరి పరిస్థితి మరింత విషయమంగా ఉండడంతో రిమ్స్‌కు తీసుకెళ్లారు. రిమ్స్‌లో కుమ్ర మల్కు, కుమ్మర రాంబాయి, మేస్రం నాని, కుమ్రం భీంరావు, జంగుబాయిలు చికిత్స పొందుతున్నారు. ఇందులో కుమ్ర మల్కు(61) తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది.

చద్మల్‌తండాలో నకిలీ నోట్ల కలకలం

గాంధారి, జనవరి 19: కామారెడ్డి జిల్లా గాంధారి మండలం చద్మల్‌తండాలో నకిలీ 500 నోట్లు కలకలం రేపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చద్మల్‌తండాలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా లక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధికి భక్తులు పెద్ద మొత్తంలో కానుకలు, విరాళాలు సమర్పిస్తారు. ఆ డబ్బులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తండాలో అవసరం ఉన్న వారికి వడ్డీకి ఇస్తారు. కమిటీలోని ఓ బాధ్యుడు ఉత్సవాల అనంతరం వడ్డీకి ఇచ్చి, తిరిగి జాతర సందర్భంగా వాటిని తీసుకుంటాడు. రూ.కోటి వరకు ఆలయ డబ్బులు ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది కూడా జాతర అనంతరం డబ్బులను తండాలో అవసరం ఉన్న పలువురికి వడ్డీకి ఇచ్చారు. కాగా ఇందులో ప్రతి ఐదు వందల నోట్ల కట్టలో నాలుగు నకిలీ నోట్లు ఉన్నట్లు కొందరు గుర్తించారు. ఈ విషయమై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తండాలోని పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ

భైంసా, జనవరి 19 : ఇంటింటి సర్వేలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొని పేర్లు రాకపోయిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం భైంసాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మరోసారి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకొని రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అందుకోసం వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, 21వ తేదీ 1, 2, 16, 4, 6వ వార్డులలో, 22న 19, 20, 22, 23, 24, 25, 26 వార్డులు, 23 న 3, 5, 18, 11, 12, 14, 15 వార్డులు, 24 న 7, 8, 9, 10, 13, 17, 21 వార్డులలో సభలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆశ కార్యకర్తల పాదయాత్రను విజయవంతం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 19 : ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21వ తేదీన నిర్మల్ గాంధీపార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పోశెట్టి, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్‌లో ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో ఆశ కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు సుగుణ, పద్మ, ఇంద్రమాల, కమల, శ్రీలత, లక్ష్మి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

ఎదులాపురం, జనవరి 19 : భార్యపై సుత్తెతో దాడి చేసి గాయపర్చిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. 2024 డిసెంబర్ 18వ తేదీన పిట్టలవాడకు చెందిన ఆనందరావు ఇంట్లో గొల్లెం వేసి సుత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడి చేసిన అనంతరం భర్త ఫరారీలో ఉండడంతో ఆదివారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రీడాకారులకు కప్ అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జనవరి 19 : క్రీడాకారులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. చాందా(టీ)లో నిర్వహించిన ఏసీఎల్ టోర్నమెంట్ 13వ సీజన్ క్రికెట్ పోటీలను ఆదివారం ఫైనల్ కొనసాగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. నేటి 11 స్టార్ వార్సె న్యూ స్టార్ తలపడగా ఫైనల్ విజేతగా 11 స్టార్ నిలిచింది. వారికి 50 వేల ప్రైస్ మనీని జోగు ఫౌండేషన్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌కు చెందిన హెచ్‌సీఏ హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న హిమ తేజ, అలాగే అండర్ 16 విదర్భ నుంచి ఆడుతున్న కషాప్ పటాస్కర్ వంటి క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ఈ క్రీడల ద్వారా స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాజిదొద్దీన్ యూనిస్ అక్బాని, బట్టు సతీశ్, బుట్టి శివ, షేక్ ఆలం, కమిటీ సభ్యులు, అధ్యక్షులు అయూబ్, వైస్ ప్రెసిడెంట్ అద్నన్, జమిలి, అప్పర్ శేఖర్, షా, కార్యకర్తలు అన్నెలా వసంత్, తన్వీర్ అసిఫ్, కలీమ్ పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

రిమ్స్‌లో బాధితులను పరమర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎదులాపురం, జనవరి 19 : నార్నూర్ మండలంలోని మాలేబోరిగా వద్ద ఐచర్ వాహనం బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆదివారం రాత్రి ఆదిలాబాద్ రిమ్స్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరమర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సూచించారు. గాయపడిన వారికి తక్షణ సాయం అందజేశారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ముథోల్, జనవరి 19 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీకాంత్ అధికారులకు సూచించారు. ముథోల్‌లోని తహసీల్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముథోల్ మండలానికి 2560 రేషన్ కార్డులు వచ్చినట్లు వివరించారు. దీంట్లో అర్హులను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే సర్వేను వేగవంతం చేయాలన్నారు. రేషన్ కార్డులు రాని వారు ఇబ్బందులకు గురికావద్దని పేర్కొన్నారు. వారు గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు ఉంటాయని తెలిపారు. ఎంపీడీవో శివకుమార్, ఆర్ఐ నారాయణ, రేషన్ డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గల్లీ క్రికెట్ పోటీలు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 19: నిర్మల్‌లోని మహాలక్ష్మి గ్రౌండ్‌లో సాదం గంగారాం, కోర్తికంటి వంశీకృష్ణ జ్ఞాపకార్థం కౌన్సిలర్ సాదం స్వప్న, అరవింద్ ఆధ్వర్యంలో నాయుడువాడ గల్లీ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలో గాడ్సే టీం సావర్కర్ టీంపై ఘన విజయం సాధించింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో గల్లీ పెద్దలు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీరవెల్లిలో అవగాహన

సారంగాపూర్, జనవరి 19: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామంలో ఆదివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఆరోగ్యంగా ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆహారంలో ఆయోడిన్ సరియైన మోతాదులో లేకపోవడంతో ఆరోగ్యంలో లోపాలు వస్తున్నాయని, ఆయోడిన్ అధికంగా ఉండే ఆహారాలు చేపలు, గుడ్డు, పాలు, మాంసం, పాల ఉత్పత్తులు, అయోడైడ్స్, ఉప్పు, ఇనుము ఆహారాలు తీసుకోవాలన్నారు. ఇందులో ఔట్ రీచ్ వర్కర్ విజ్జగిరి రవళి పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చారు కానీ.. టీఏ, డీఏ ఇవ్వలేదు

భైంసా, జనవరి 19 : ముథోల్ నియోజకవర్గంలోని 2024 మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరగగ విధులు నిర్వహించిన సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చారు కాని టీఏ డీఏ ఇవ్వలేదని తెలంగాణ గజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కార్గాం వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. 59 రోజుల పాటు వివిధ రకాల విధులలో పాల్గొన్న ఇప్పటి వరకు ఉన్నతాధికారులు రావాల్సిన టీఏ డీఏలపై స్పందించడం లేదని ఏఆర్‌వోను సంప్రదించిన స్పష్టమైన సమాధానం రావడం లేదన్నారు. తొమ్మిది నెలలు కావస్తున్నా టీఏ, డీఏలు చెల్లించడం లేదని వెంటనే స్పందించి బిల్లులు చెల్లించాలని కోరారు.

భక్తులతో కిటకిటలాడిన పూసాయి ఎల్లమ్మ ఆలయం

పోటెత్తిన భక్తజనం

జైనథ్, జనవరి 19 : పూసాయి ఎల్లమ్మ, మండల సరిహద్దులోని పెన్‌గంగా మహాజాతర ఆదివారం భక్తులతో పోటెత్తింది. పూసాయి ఎల్లమ్మకు వివిధ పిండి వంటలతో కూడిన నైవేద్యాలతోపాటు మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో జైనథ్ ఎస్సై పురుషోత్తం భారీ బందోబస్తు నిర్వహించారు. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులను తీర్చుకున్నారు.

WATCH & ENJOY RELOADED VERSION IN THEATRES

మల్టిప్లెక్స్ టికెట్ ధర : ~~295~~/- 150/-, ~~350~~/- 200/-

సింగిల్ స్క్రీన్స్ టికెట్ ధర : 112/-, 90/-, 55/-,

సంధ్య 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 10.00,2.00,6.00,10.00

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

MYTHRI విమల్ 70 - బాలానగర్ 8.00AM 64 Channel Dolby Atmos 4k Laser Projection Centrally Air Conditiond | MYTHRI రాజధాని 70 - బిల్‌సుఖ్‌నగర్ 10.45,2.45

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | PVR ఐకాన్ - హైటెక్ సిటీ | మీరజ్ సినిమాస్ - చందానగర్ | AMB ఎఎంబి ఎ/సి - గచ్చిబౌలి

PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ | PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి | Cinépolis KANAKIA MALL లూలూ మాల్ - కూకట్‌పల్లి | AAA ఎఎఎ ఎ/సి - అమీర్‌పేట్

PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి | INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ | Cinépolis KALAKARA CCPL - మల్కాజ్‌గిరి | MOVIETIME ప్లాటినమ్ - అమీర్‌పేట్

PVR గలేరియా - పంజాగుట్ట | INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ | Cinépolis డి.ఎల్.ఎస్ - ఉప్పల్ | MOVIETIME ప్లైమాల్ - సనత్‌నగర్

PVR పివిఆర్ - ఎర్రమంజిల్ | మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ | Cinépolis టివిఎన్ఆర్ ఎ/సి - కొంపల్లి | MOVIETIME యస్ఎల్‌టి - గచ్చిబౌలి

PVR పివిఆర్ - మూసారంబాగ్ | మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్ | AMB ఎఎంఆర్ - మౌలాలి | తివోలి తివోలి - సికింద్రాబాద్

అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల

పివిఆర్‌యస్2 - వరంగల్ | పివిఆర్ వేణు - నిజామాబాద్

MYTHRI శ్రీకృష్ణ - మహబూబ్‌నగర్ | వెంకటేశ్వర - మంచిర్యాల

MYTHRI కెపియస్ (అవిత్) - ఖమ్మం 11.00AM | వెంకటరమణ - సిరిపూర్‌కాగజ్‌నగర్

పియస్ గెలాక్సీ ఎ/సి - ఖమ్మం | కమల 70 ఎ/సి - బైంసా

శ్రీసాయిరాం ఎ/సి - ఖమ్మం | శాంతి 70 ఎ/సి - మరిపెడ

MYTHRI వెంకటేశ్వర - కరీంనగర్ 11.00AM | రంగ ఎ/సి - కోదాడ

నటరాజ్ ఎ/సి - నిజామాబాద్ | దర్శన్ 70 ఎ/సి - కామారెడ్డి

హిందీ వెర్షన్

Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్ | INOX ఐ.పి.మాల్ - కాచిగూడ

Cinépolis సుధ - శాలిబండ | INOX బినాక్స్ - బంజారాహిల్స్

INOX సత్వనెక్లిస్ మాల్ ఎ/సి - కవాడిగూడ

MYTHRI MOVIE DISTRIBUTORS LLP